'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

**నమస్తే తెలంగాణ**

# ఆవరిస్తున్న యుద్ధ మేఘాలు

**ప్రపంచంలో** యుద్ధోన్మాదపు హుంకారాలు, ఘీంకారాలు అంతకంతకు పెచ్చరిల్లుతున్నాయి. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం ఓ వైపు ఎడతెరిపి లేకుండా కొనసాగుతూనే ఉన్నది. ముగింపు కనుచూపు మేరలో కనిపించడం లేదు. మరోవైపు గాజా మారణహోమం భగభగ మండుతూనే ఉన్నది. అదలా ఉండగానే ఇంకోవైపు ఇజ్రాయెల్-ఇరాన్ కీచులాట శ్రుతిమించి పూర్తిస్థాయి యుద్ధంగా పరిణమిస్తున్న సూచనలు కనిపిస్తున్నాయి. అటు తైవాన్ మీదికి ఎప్పుడు కాలు దువ్వుదామా అని చైనా ఉరుకులాడుతున్నది. ఇవన్నీ ప్రపంచ శాంతిని ప్రమాదంలో పడవేస్తున్న ఘటనలే. హమాస్ దాడికి ప్రతీకారమంటూ గాజాలోకి ప్రవేశించిన ఇజ్రాయెల్ అక్కడ మారణహోమం సృష్టిస్తున్నది. ఇప్పటివరకు 30 వేల మందికి పైగా పౌరుల ప్రాణాలు గాల్లో కలిసిపోయాయి. వారిలో అత్యధికులు స్త్రీలు, పిల్లలే కావడం అత్యంత బాధాకరం. సిరియా, లెబనాన్ తదితర దేశాల్లోని పాలస్తీనా అనుకూల దళాలపైనా ఇజ్రాయెల్ దాడులు చేస్తున్నది. అందులో భాగంగా సిరియాపై ఇజ్రాయెల్ జరిపిన దాడిలో ఇరాన్ కాన్సులేట్ ధ్వంసమైంది. ఈ దాడిలో ఇరాన్ దౌత్య సిబ్బందితో పాటు పలువురు సీనియర్ సైనికాధికారులు కూడా మరణించారు. దీంతో ఇరాన్ డ్రోన్లు, క్షిపణులతో ఇజ్రాయెల్‌పై విరుచుకుపడింది.

1991లో ఇరాక్ తర్వాత ఇజ్రాయెల్‌పై ఓ శత్రుదేశం ప్రత్యక్ష క్షిపణి దాడులకు దిగడం ఇదే ప్రథమం. అయితే ఇరాన్ ప్రయోగించిన దాదాపు అన్ని క్షిపణులను ఇజ్రాయెల్ ఐరన్ డోమ్ (ఉక్కు గోపురం) వ్యవస్థ సాయంతో నేలకూల్చింది. ఇదిలా ఉండగా ఇరాన్‌పై ఎదురుదాడికి ఇజ్రాయెల్ సమాయత్తమవుతున్నట్టు వార్తలు వెలువడుతున్నాయి. ఇజ్రాయెల్ అప్రకటిత అణ్వాయుధ దేశం. ఇరాన్ కూడా అణ్వాయుధాల కోసం తీవ్రంగా ప్రయత్నించిన సంగతి తెలిసిందే. ఈ రెండు శక్తివంతమైన దేశాలు ప్రత్యక్ష యుద్ధంలో తలపడటం ఏ మాత్రం వాంఛనీయం కాదు. ఈ ఘర్షణ చిలికిచిలికి గాలివానగా మారి పశ్చిమాసియాను అగ్నిగుండంగా మారుస్తుందేమోననే భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఇజ్రాయెల్ తరపున రంగంలోకి అమెరికా దిగితే ఇరాన్ తరపున తామూ సమరానికి సై అంటామని రష్యా చేసిన ప్రకటన ఉద్రిక్తతను మరింతగా పెంచుతున్నది. ఈ సరికే రష్యా-ఉక్రెయిన్ యుద్ధం రావణకాష్ఠంలా మారి రెండేండ్లుగా రగులుతూనే ఉన్నది.

అమెరికా నేతృత్వంలోని నాటో నుంచి ఎదురవుతున్న ముప్పును తప్పించుకునేందుకు ఉక్రెయిన్ మీదకు రష్యా ఉరికింది. ఈ యుద్ధం వల్ల ఎంతో ధననష్టం, ప్రాణనష్టం సంభవిస్తున్నది. ఉక్రెయిన్‌కు అమెరికా తదితర పశ్చిమ దేశాలు ఆయుధాలు సమకూరుస్తున్నాయి. ఒకరకంగా ప్రచ్ఛన్న యుద్ధం కొనసాగుతున్నది. ఉక్రెయిన్ ఒకవేళ యుద్ధం నుంచి గెలిచి లేదా ఓడిపోయి బయటపడినా అప్పుల బాధ నుంచి తప్పించుకోవడం కష్టమవుతుందని పరిశీలకులు అంటున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రపంచానికి కావాల్సింది దేశాలను బూడిద కుప్పలుగా మార్చే యుద్ధాలు కాదు. పేదరికంపై, ఆకలిపై యుద్ధం చేయాల్సి ఉంది. అవిద్యపై, రోగాలపై యుద్ధం చేయాల్సి ఉంది. ఇంకా చెప్పాలంటే పతనం అంచుకు చేరిన పర్యావరణానికి పచ్చదనంతో తిరిగి ప్రాణం పోసేందుకు యుద్ధం చేయాల్సి ఉంది. ఈ పరిస్థితుల్లో యుద్ధ నివారణకు అమెరికా తదితర దేశాలు, ఐక్యరాజ్య సమితి పూనుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ప్రపంచశాంతి నెలకొల్పేందుకు భారత్ అండదండలు ఎటూ ఉండనే ఉంటాయి.

# తెలంగాణ ప్రజలారా.. మేలుకోండి!

**'పాలకులకు సత్యనిష్ఠ మినహా మరేదీ ప్రజా విశ్వాసాన్ని సంపాదించలేదు' అని అన్నారు భీష్ముడు. ఇది సార్వత్రిక సత్యం. కానీ, 'పొద్దున విత్తునాటి, రాత్రికి పండు కోసుకోవాలనే' అత్యాశాపరులైన నేతలు, ఆధునిక భారతంలో అడ్డదారిని సృష్టించారు. 'గంగానదిని మురికి కాలువగా, మురికి కాలువను గంగానదిగా భ్రమింపజేయగలిగిన మీడియా, సోషల్ మీడియాల అండతో, అభాండాల ఉపన్యాసాలతో పనిచేసే ప్రభుత్వాలను పడగొట్టి, అధికారానికి రావచ్చని, వచ్చాక పని చేయకుండానే ప్రజలను మభ్యపెడుతూ పబ్బం గడుపుకోవచ్చని నిరూపించారు. అలాంటి నేతలలో నరేంద్ర మోదీ, రేవంత్‌రెడ్డి అగ్రగణ్యులని, వారిలోనూ రేవంత్ ప్రథముడని అంటున్నారు. 'పార్టీ మారటం, మారగానే ఆ పార్టీ రాష్ట్రాధ్యక్షుడు కావటం, అయిన కొద్దికాలానికే మంత్రిగా అనుభవం కూడా లేకపోయినా చిన్న వయసులోనే ముఖ్యమంత్రి కావటమే అందుకు నిదర్శనమంటున్నారు పరిశీలకులు. అందుకోసం అబద్ధాల సోషల్ మీడియాను, అభాండాల నోటిని రేవంత్‌రెడ్డి వాడినంత సమర్థవంతంగా మోదీ తప్ప దేశంలో మరే నేతా వాడలేదనటానికి గత అసెంబ్లీ ఎన్నికలే సాక్ష్యం అంటున్నారు.**



**పాతూరి వేంకటేశ్వరరావు**
98490 81889

అభాండాల ఉపన్యాసాలు: తెలంగాణను సాధించి, దశాబ్దికాలంలో భారతాగ్ర రాష్ట్రంగా తీర్చిదిద్దిన బీఆర్ఎస్‌ను అవినీతి పార్టీగా, తెలంగాణ పిత కేసీఆర్‌ను నియంతగా అబద్ధాల సోషల్ మీడియా అండదండలతో భ్రమింపజేయగలిగారు. అసాధ్యాలు అని తెలిసి కూడా అలవోకగా హామీలిచ్చేశారు. ఉదాహరణకు.. 'కేసీఆర్ మీ రుణాలు మాఫీ చేసినా సరే, ఇప్పటికిప్పుడు బ్యాంకులకెళ్లి 2 లక్షల రూపాయల రుణం తీసుకోండి. డిసెంబర్ 9 కల్లా వాటిని రద్దు చేస్తా. నన్ను గెలిపించండి' అంటూ తెలంగాణ ప్రజలను ఆశామోహంలో ముంచేశారు. దటీజ్ రేవంత్‌రెడ్డి.

ఇక ఉత్తర భారతాన విస్తరిస్తున్న 'కేజ్రీవాల్'ను దక్షిణ భారతాన నిర్దిష్ట ప్రణాళికతో తనకు సవాలు విసురుతున్న కేసీఆర్‌ను దెబ్బ తీసేందుకు కాచుకుకూర్చున్న నరేంద్ర మోదీ తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల నాటి నుంచి వ్యూహాలు పన్నారు. రేవంత్‌ను మించి దుందుడుకు బండి సంజయ్ నాయకత్వంలో థర్డ్ ఫోర్స్‌గా దూసుకొచ్చింది బీజేపీ. ఆ దూకుడుతో ఎన్నికలకు వెళ్తే ముక్కోణపు పోటీగా మారుతుంది. కేసీఆర్ విజేత అవుతారు. అందుకని బండి సంజయ్‌ను తప్పించి, కిషన్‌రెడ్డి చేతికి పార్టీ పగ్గాలు అప్పగించారు. ఆ సమయంలో కవితను అరెస్టు చేస్తే, బీఆర్ఎస్‌కు సింపతీ పెరుగుతుందని వెనక్కు తగ్గారు. తద్వారా 'బీజేపీకి బీ టీమ్ బీఆర్ఎస్' అన్న కాంగ్రెస్ దుష్ప్రచారానికి బలం చేకూర్చి, బీఆర్ఎస్‌కు దన్నుగా ఉన్న ముస్లిం, దళిత ఓటర్లను కొంత మేరకు కాంగ్రెస్‌కు బదిలీ చేయించగలిగారు. అలా 1.8 శాతం ఓట్ల తేడాతో కాంగ్రెస్‌ను గెలిపించి, కేసీఆర్‌ను దెబ్బ తీశారు. దటీజ్ నరేంద్ర మోదీ.

రేవంత్‌రెడ్డి కూడా రాహుల్ గాంధీ నిరసిస్తున్నా సరే, మోదీ అనుంగు మిత్రుడు ఆదానీకి తెలంగాణలో చోటిచ్చారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ ముఖ్య అభ్యర్థుల గెలుపు కోసం కాంగ్రెస్ తరపున బలహీన అభ్యర్థులను నిలిపి మోదీ రుణాన్ని రేవంత్‌రెడ్డి తీర్చుకున్నారని పరిశీలకులు చెప్తున్నారు. అలా మోదీ వ్యూహంలో, రేవంత్ భ్రమల్లో, వారిద్దరి క్విడ్ ప్రో కోలో తెలంగాణ ప్రజలు చిక్కుకోవటం వల్లనే పదేండ్ల




కిందటి సాగు, తాగునీటి కరువు, చెరువులు, బోర్లు ఒట్టిపోవటం, విద్యుత్తు కోతలు, ట్రాన్స్‌ఫార్మర్లు కాలటం, పంటలు ఎండిపోవడం, అన్నదాతల ఆత్మహత్యలు వగైరా సమస్యలన్నీ తిరిగి తెలంగాణను చుట్టుముట్టాయి.

**అందుకే తెలంగాణ సహోదరులారా, కర్షక, కార్మిక, విద్యార్థి, ఉపాధ్యాయ, ఉద్యోగ, మేధావులారా, కవులు కళాకారులారా.. అబద్ధాల, అభాండాల సోషల్ మీడియా ప్రవాహంలో కొట్టుకుపోకండి. దయచేసి మీ సొంత బుద్ధిని శరణు వేడండి. ప్రజలను మేల్కొల్పండి. వాగ్దాన కర్ణులు మోదీ, రేవంత్‌ల పట్ల అప్రమత్తంగా ఉండండి.**

రేవంత్‌రెడ్డి లాంటి నాయకులు తమ అవసరాల కోసం ఎన్ని హామీలనైనా గుప్పిస్తారు. అవసరం తీరాక అంబాలీస్ అంటారు. ఆ మేరకే నష్టం. కానీ, మోదీ అలా కాదు, ఇచ్చిన హామీని నెరవేర్చకపోగా, తద్భిన్నంగా వ్యవహరిస్తారు. ఉదాహరణకు తాము అధికారానికి వచ్చాక ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్నారు. కానీ, అందుకు భిన్నంగా ఏటా రెండు కోట్ల నిరుద్యోగులను సృష్టించారు. అన్నదాతల ఆదాయాన్ని రెట్టింపు చేస్తానని చెప్పి.. వ్యవసాయ ఖర్చులను రెట్టింపు చేశారు. విదేశాల్లోని నల్లధనాన్ని రప్పించి, ప్రతి భారతీయుని ఖాతాలో 15 లక్షల రూపాయలు వేస్తానన్నారు. కానీ, ఎన్నికల బాండ్ల రూపంలో వేల కోట్ల నల్లధనాన్ని బీజేపీ ఖాతాలో వేయించారు. ఆరు దశాబ్దాల పాలనలో రూ.55 లక్షల కోట్ల అప్పుల కుప్పగా దేశాన్ని కాంగ్రెస్ మార్చిందని, తాను భారత్‌ను సుసంపన్నం చేశానని చెప్పుకొనే మోదీ.. కేవలం దశాబ్ద కాలంలో రూ.155 లక్షల కోట్ల అప్పుల కొండగా దేశాన్ని దిగజార్చారు. డాలర్‌కు 63 రూపాయలుగా రూపాయి విలువను కాంగ్రెస్ చేసిందని, పాలకునిగా రూపాయి విలువను పెంచటమెలాగో తనకు తెలుసని మోదీ ప్రకటించారు. కానీ, ఆయన డాలరుకు 83 రూపాయలకు చేర్చి రూపాయి విలువను పాతాళానికి పడేశారు. భారతీయులకు అచ్చేదిన్ తెస్తానన్న మోదీ.. లక్షల కోట్ల రుణమాఫీ, పన్ను రాయితీల ద్వారా బడా కార్పొరేట్లకు అచ్చేదిన్ తెచ్చిన మాట వాస్తవం. ఆ లోటు పూడ్చడానికి ఇంధన ధరలను భారీగా పెంచి, పాలు, పెరుగుతో సహా నిత్యావసరాలపై జీఎస్టీ బాది ధరలను చుక్కలకు తాకించి బడుగు, బలహీన, నిరుద్యోగ వర్గాలకు చచ్చేదిన్ తెచ్చారు. అందుకే ఉద్యోగ, ఉపాధి లేమితో భారత్‌లో బతకలేక చచ్చే కన్నా, బతకటం కోసం చావటానికి సిద్ధపడి నిత్యాగ్ని గుండాల వంటి గాజా, ఉక్రెయిన్‌లకు సైనికులు, కూలీలుగా భారతీయులు వలస వెళ్తున్నారు. నిరుద్యోగ తీవ్రతకు ఇంతకన్నా నిదర్శనమేం కావాలి. ప్రపంచం తలెత్తుకు చూసేంత సమున్నతంగా భారతదేశాన్ని తీర్చిదిద్దుతానని మోదీ హామీ ఇచ్చారు. పరిశ్రమలు చైనా వీడి భారత్‌కు వచ్చేలా పటిష్ఠం చేస్తానన్నారు. కానీ వాస్తవం ఏమంటే.. చైనా వార్షిక ఆదాయం 16.5 ట్రిలియన్ డాలర్లు. భారత వార్షికాదాయం 3 ట్రిలియన్ డాలర్లు. యాపిల్ కంపెనీ వార్షిక ఆదాయం 3.1 ట్రిలియన్ డాలర్లు. అంటే ఒక కంపెనీ ఆదాయం కన్నా మన దేశ ఆదాయం తక్కువ. అంతేకాదు పర్యావరణం, ప్రజాస్వామ్యం, పత్రికాస్వేచ్ఛ, మానవ వనరుల అభివృద్ధి, ఆకలి సూచీ తదితర అన్ని రంగాల్లోనూ ప్రపంచం తలదించుకొని తొంగిచూసేంత కిందికి భారతదేశాన్ని నెట్టేశారు మోదీ. ఐరాసతో సహా ప్రపంచ సర్వే సంస్థలు ప్రకటించిన వాస్తవాలివి.

'హిందువులను ఉద్ధరించే పార్టీ' బీజేపీ అన్న భ్రమలో హిందువులను ముంచేశారు మోదీ. వాస్తవానికి మోదీ, బీజేపీ పాలనలో హిందువులు నష్టపోయినంతగా మరే ప్రభుత్వంలోనూ నష్టపోలేదని గణాంకాలతో సహా వివరిస్తున్నారు పరిశీలకులు. వ్యవసాయాన్ని కార్పొరేటీకరించేందుకు మోదీ తెచ్చిన నల్ల వ్యవసాయ చట్టాల వల్ల, స్వామినాథన్ వంటి వ్యవసాయ పరిశోధకులు సూచించినట్టు పంటలకు గిట్టుబాటు ధరలను చట్టబద్ధం చేయనందున, డీజిల్ ధరలు భారీగా పెంచినందున వ్యవసాయ ఖర్చులు రెట్టింపు అయ్యి, నష్టాలకు గురై అన్నదాతలు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. పెద్ద నోట్ల రద్దు వల్ల లక్షలాది చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, చిన్న చిన్న వ్యాపారాలు మూతబడి ఉపాధి కోల్పోయారు. కొత్తగా ఒక్క ప్రభుత్వరంగ సంస్థను నెలకొల్పకపోగా, ఉన్న ప్రభుత్వ సంస్థలను తెగనమ్ముతున్న భారతైక ప్రధాని నరేంద్ర మోదీ. ఆ కారణంగా ఉద్యోగాలు కోల్పోయి, కొత్త ఉద్యోగాల సృష్టి లేకపోవడంతో అనేకమంది నిరుద్యోగులుగా మిగిలారు. వీరిలో 80 శాతం మంది హరిజన, గిరిజన, బీసీ, ఓబీసీ వర్గాలకు చెందిన హిందువులేనన్నది స్పష్టం.

**అవినీతి నిర్మూలనే తమ లక్ష్యం అంటూ గొప్పలు చెప్పుకొంటున్న మోదీ 'ఈడీ, ఐటీ, సీబీఐ' త్రిశూలంతో వేట ప్రారంభించిన మాట నిజమే. కానీ, తీరా చూస్తే.. అవినీతి నిర్మూలనకు కాదు, ప్రతిపక్షాలను బెదిరించి లొంగదీసుకోవటానికేనని కేసుల గణాంకాలే స్పష్టీకరిస్తున్నాయి. ఉదాహరణకు మోదీ త్రిశూలపు వేటలో పీఎంఎల్ఏ మొదలగు చట్టాల కింద బనాయించిన కేసులు 5,422. వీటిలో రుజువైనవి కేవలం 25. ఈ కేసుల్లో బీజేపీయేతర పార్టీల వారిపై పెట్టిన కేసులు 5,150. ఈ కేసులకు బెదిరి బీజేపీ కండువా కప్పుకొన్నవారు 2,987 మంది అని పరిశీలకులు తేల్చారు.**

మాంత్రికుడు తన మంత్రదండాన్ని తాకించగానే వ్యక్తిని ఆవహించిన భూత, ప్రేత, పిశాచాలన్నీ పటాపంచలైనట్టు.. బీజేపీ కండువా కప్పుకోగానే ఎంత పెద్ద అవినీతి మరకైనా ఇట్టే మాయమవుతుంది. ఉదాహరణకు రూ.7 వేల కోట్ల అవినీతి మరక అంటిన సీఎం రమేశ్ మొదలు రూ.70 వేల కోట్ల అవినీతి మరక అంటిన గాలి జనార్దన్‌రెడ్డి దాకా 25 మంది కాషాయ కండువా కప్పుకొని తమ మరకల్ని పూర్తిగా చెరిపేసుకున్నారు. అంతేకాదు, హిమంత బిశ్వశర్మ, ఏక్‌నాథ్ షిండే తదితరులు బీజేపీ, కూటమి ముఖ్యమంత్రులుగా, అజిత్ పవార్ లాంటివారు ఉప ముఖ్యమంత్రులుగా, సుజనా చౌదరి మొదలైనవారు ఎంపీలుగా వెలిగిపోతున్నారు. పాపం! ఈ చిన్న లాజిక్కును తెల్సుకోలేక విజయ్ మాల్యా, నీరవ్ మోదీ తదితరులు విదేశాలకు పారిపోయి, తమ అవినీతి మరకలను తొలగించుకోలేకపోతున్నారు.

తెలంగాణ సహోదరులారా, మేధావులారా ఇప్పటికైనా ఆలోచించండి. ఇప్పటికీ నిరూపణ కాని రూ.100 కోట్ల అవినీతి ఆరోపణలతో కేజ్రీవాల్, కవిత తదితరులను మోదీ వేధించటం వెనుక ఆంతర్యమేమిటో దయచేసి మీ సొంత బుద్ధితో ఆలోచించండి. బుద్ధ భగవానుడు చెప్పినట్టు.. 'బుద్ధం శరణం గచ్ఛామి'. అబద్ధాల మీడియా, సోషల్ మీడియాలను కాదు, మీ సొంత బుద్ధిని నమ్మండి.

# రాజకీయ వంచనకు బలికావొద్దు!

**కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దశాబ్దకాలంగా ప్రజల ఆలోచనలను దారిమళ్లిస్తూ, వారి మెదళ్లపై థాట్ పోలీసింగ్ చేస్తూ యథేచ్ఛగా పాలన సాగిస్తున్నది. 2014, 2019, 2024 మూడు లోక్ సభ ఎన్నికలకు సంబంధించి బీజేపీ తీసుకువచ్చిన మ్యానిఫెస్టోలు పూర్తిగా ఒకదానికొకటి విరుద్ధమైనవి. గతంలో ప్రకటించిన రెండు సార్వత్రిక ఎన్నికల మ్యానిఫెస్టోల్లోని అంశాలు ఇక భారతదేశ దరిద్రాన్ని సమూలంగా మార్చేలా కనిపిస్తాయి. కానీ దేశాన్ని బీజేపీ పదేండ్లు పాలించినా ఎలాంటి వెలుగులు రాకపోగా.. దేశం ప్రజల పరిస్థితి మరింత దిగజారింది.**



**బండారు జితేందర్**
93912 94127

బీజేపీ నేతలు ఎన్నికల సందర్భంగా ఇచ్చే ప్రకటనలు, వ్యాఖ్యానాలు మీడియాకు పెద్ద పెద్ద శీర్షికలు పెట్టేందుకు సరిపోతాయి. కానీ, వాస్తవానికి వాటివల్ల ఈ దేశ ప్రజలకు ఒరిగింది శూన్యం. ఈ దేశానికి సర్వరోగ నివారిణి బీజేపీ ఒక్కటేనని మోదీ-షా ద్వయం భారత ప్రజల మెదళ్లలో ఎక్కించజూస్తున్నది.

2004 నుంచి 2014 వరకు సాగిన కాంగ్రెస్ పదేండ్ల పాలనతో ఈ దేశ ప్రజలు విసిగిపోయారు. ఇదే అదనుగా భావించిన బీజేపీ, ఆర్ఎస్ఎస్ పక్కా ప్రణాళికతో తామే ఈ దేశానికి ప్రత్యామ్నాయం అనే ధోరణితో 2014 ఎన్నికల్లో ముందుకువచ్చాయి. అప్పటికే దేశంలో పేరుకుపోయిన అనేక సమస్యలకు పరిష్కారం చూపుతామని ఆశ చూపింది కాషాయ పార్టీ. అందులో భాగంగా 2014 ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రజలు ఊహించని హామీలను పొందుపరిచింది. ప్రతి పేదవాడి ఖాతాలో రూ.15 లక్షల జమ, స్విస్ బ్యాంకుల్లో నల్లధనం వెలికితీత, బడా ఆర్థిక నేరస్థుల అరెస్టు, యువతకు ఏడాదికి 2 కోట్ల ఉద్యోగాల కల్పన, పంటలకు కనీస మద్దతు ధర, నిత్యావసర సరుకుల ధరల నియంత్రణ పేరుతో మొదటిసారి బీజేపీ అధికారంలోకి వచ్చింది. 2014 'సబ్ కా సాత్ సబ్ కా విశ్వాస్' అంటూ అధికారం చేపట్టిన బీజేపీ ముఖ్యంగా మోదీ బృందం వల్ల దేశానికి ఎలాంటి లాభం జరుగలేదు. 2014 ఎన్నికల మ్యానిఫెస్టోలో చెప్పిన, పొందుపరిచిన ఒక్క అంశాన్ని కూడా ప్రధాని మోదీ నేరవేర్చలేకపోయారు.

తర్వాత 2019 సార్వత్రిక ఎన్నిలకు కొత్త ఎజెండాను ముందుకు తీసుకువచ్చింది. ప్రజలను మళ్లీ అబద్ధపు హామీలతో ఊరించింది. 75 ఏండ్ల భారతానికి 75 హామీల పేరుతో మరో మ్యానిఫెస్టోను వదిలింది. రైతుల ఆదాయం రెట్టింపు చేయడం, భారత ఆర్థిక వ్యవస్థను 5 ట్రిలియన్ డాలర్ల వ్యవస్థగా మార్చడం, ప్రభుత్వ రంగ సంస్థల్లో ఉద్యోగాల కల్పన వంటి కీలక అంశాలను ఎన్నికల ప్రచారాస్త్రాలుగా చేసుకొని మోదీ, అమిత్ షా ద్వయం రెండోసారి అధికారం చేపట్టింది. అయితే 2014లో మ్యానిఫెస్టోలో పెట్టిన ఏడాదికి 2 కోట్ల ఉద్యోగాల కల్పన, నల్లధనం వెలికితీత వంటి అంశాలు 2019 ఎన్నికల మ్యానిఫెస్టోలో మచ్చుకైనా లేవు. 'సబ్‌కా సాత్ సబ్‌కా వికాస్, సబ్‌కా విశ్వాస్, సబ్‌కా ప్రయాస్' పేరుతో ప్రజల ఆలోచనలను దారిమళ్లించి రెండోవిడత అధికారం చేపట్టిన బీజేపీ ఆ తర్వాత తీసుకున్నవన్నీ ప్రజావ్యతిరేక నిర్ణయాలే. అందులో భాగంగా పెట్రోల్, గ్యాస్ ధరల రెట్టింపు, నిత్యావసర ధరల పెంపు, ప్రభుత్వరంగ సంస్థల నిర్వీర్యం, నూతన వ్యవసాయ చట్టాలు, పెరిగిన రైతుల ఆత్మహత్యలు, తీవ్ర ద్రవ్యోల్బణం వంటి అంశాలు దేశ ప్రజలను అల్లకల్లోలం చేసి, తీవ్ర వేదనలోకి నెట్టివేశాయి. మూడోసారి దేశ ప్రజలను మోసం చేసేందుకు సిద్ధమవుతున్నది బీజేపీ. అన్ని సమస్యలకు పరిష్కారం చూపామని పదే పదే చెప్పే బీజేపీ మళ్లీ కొత్త ఎన్నికల ఎజెండాతో రంగంలోకి దిగింది.

వరుసగా రెండుసార్లు మోసం చేసిన బీజేపీ.. తాజాగా 'సంకల్ప పత్రం-మోదీ గ్యారెంటీ' అనే కొత్త పేరుతో 2024 మ్యానిఫెస్టోను విడుదల చేసింది. వికసిత భారత్ థీమ్ అంటూ 14 అంశాలతో ఎన్నికల మ్యానిఫెస్టోను రూపొందించింది. ప్రధానంగా వృద్ధులకు ఆయుష్మాన్ భారత్, యూనిఫాం సివిల్ కోడ్ అమలు చేయడం, జమిలి ఎన్నికల నిర్వహణ అంటూ మ్యానిఫెస్టోలో ప్రధానంగా పేర్కొన్నది. అయితే గతంలో రెండు దశల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను గాలికి వదిలేసింది.




**ప్రతి ఎన్నికకు కొత్త మ్యానిఫెస్టోను తీసుకురావడం బీజేపీకి తెలిసిన ఒక వంచన. నోట్ల రద్దు, జీఎస్టీలతో సామాన్యుల ఉసురు తీసుకున్న బీజేపీ సర్కార్.. జమిలి ఎన్నికలు, యూనిఫాం సివిల్ కోడ్ అమలు పేరుతో మరోసారి మాయ చేయాలని చూస్తున్నది. రెండు మ్యానిఫెస్టోలు అబద్ధాలని తేలినట్టే.. 2024 లోక్‌సభ ఎన్నికల మ్యానిఫెస్టో కూడా అబద్ధాల పుట్ట అని ప్రజలు గ్రహించాలి.**

మరోసారి దేశ ప్రజలను మోసం చేసేందుకు 'సంకల్ప పత్రం' పేరుతో బీజేపీ మాయ చేయాలని చూస్తున్నది. గతంలో మాదిరిగా ప్రజలపై థాట్ పోలీసింగ్ చేయాలని బీజేపీ పక్కా ప్రణాళికతో ముందుకు వస్తున్నది. విశాల భారతాన్ని విద్వేషాల భారత్‌గా మార్చిన బీజేపీ చెర నుంచి బయటపడాలంటే ప్రజలంతా జాగరూకతతో వ్యవహరించాలి. ప్రజల కోసం పోరాడే పార్టీలనే ఎన్నుకోవాలి.

**దేశానికి స్వాతంత్య్రం వచ్చిన తర్వాత సామాజిక, ఆర్థిక అసమానతలు తొలగిపోయి.. దోపిడీ, వివక్ష, పీడన నుంచి విముక్తి కలుగుతుందని ఆశించిన బీసీల ఆశలు అడియాసలయ్యాయి. స్వయం పాలనలోనూ ప్రజాస్వామ్యం ముసుగులో అగ్రకుల పెట్టుబడిదారులు పాలన పగ్గాలను తమ గుప్పెట్లోనే పెట్టుకున్నారు. దేశానికి స్వాతంత్య్రం సిద్ధించి 75 ఏండ్లు పూర్తయినప్పటికీ వెనుకబడిన కులాలకు దాని ఫలాలు నేటికీ సంపూర్ణంగా అందడం లేదు. సంపద, భూములు, అధికారాన్ని కొందరు తమ చేతుల్లోనే బందీగా చేసుకొని.. పేదరికాన్ని, నిరుద్యోగాన్ని పెంచి పోషిస్తూ బీసీలను ఓటు బ్యాంకుగానే వాడుకుంటుండటం విచారకరం.**

# బీసీల వినాశనమే ఆ పార్టీల ఎజెండా



**బూర్గుపల్లి కృష్ణయాదవ్**

స్వాతంత్య్రం వచ్చిన తొలినాళ్లలో దేశాన్ని పాలించిన కాంగ్రెస్ పార్టీ ఉద్దేశపూర్వకంగానే రాజ్యాంగం కల్పించిన హక్కులు బీసీలకు దక్కకుండా చేసింది. నెహ్రూ, ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీల హయాంలోనే బీసీలు రాజకీయంగా తీవ్రంగా అణచివేతకు గురయ్యారు. కాంగ్రెస్ తర్వాత దేశాన్ని ఎక్కువ కాలం పాటు పాలించిన బీజేపీ కూడా బీసీలను వంచించింది. బిందేశ్వరి ప్రసాద్ మండల్ ఇచ్చిన నివేదిక అమలు కాకుండా అడ్డుకున్నది బీజేపీ నేతలే. నివేదిక అమలుకు వ్యతిరేకంగా, రిజర్వేషన్లకు వ్యతిరేకంగా, బీసీల వినాశనమే ఏకైక లక్ష్యంగా ఆ పార్టీ అగ్రనేత ఎల్‌కే అద్వానీ రథయాత్ర చేపట్టి బీసీ రిజర్వేషన్లను అడ్డుకున్నారు.

2018లో పార్లమెంట్ సాక్షిగా అప్పటి కేంద్ర హోంశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ 2021లో చేపట్టబోయే జనగణనలో భాగంగా బీసీ కులాల గణన చేపడతామని హామీ ఇచ్చారు. ఆ హామీని బీజేపీ విస్తృతంగా ప్రచారం చేసింది. బీజేపీ హామీని నమ్మిన బీసీలు 2019 సార్వత్రిక ఎన్నికల్లో ఆ పార్టీని గెలిపించారు. కానీ, అధికారంలోకి వచ్చిన తర్వాత బీజేపీ సర్కార్ మాట మార్చింది. కుల గణన చేపడితే కులాల మధ్య ఘర్షణలు తలెత్తుతాయని, దేశం విచ్ఛిన్నమవుతుందని, కులగణనకు తాము వ్యతిరేకమని ప్రకటించి బీసీలను మరోసారి మోసం చేసింది. మరోవైపు అధికారమే లక్ష్యంగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ కూడా కుల గణన చేపడతామని తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన వెంటనే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని నమ్మబలికారు. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి నాలుగు నెలలైనా ఆ ఊసే ఎత్తడం లేదు. సర్పంచుల పదవీకాలం ముగిసి మూడు నెలలవుతున్నా ఎన్నికల నిర్వహణపై దృష్టి పెట్టడం లేదు. బీసీ రిజర్వేషన్లు పెంచాల్సి వస్తుందన్న కుట్రతోనే సకాలంలో ఎన్నికలు నిర్వహించలేదనే ఆరోపణలున్నాయి. బీజేపీని ఆదర్శంగా తీసుకున్న రాహుల్‌గాంధీ తాము కేంద్రంలో అధికారంలోకి రాగానే ఓబీసీ కుల గణన చేపడుతామని పార్లమెంట్ ఎన్నికల ప్రచార సభల్లో హామీ ఇస్తున్నారు. కులగణన చేపడతామని నాలుగు నెలల కిందట ఇచ్చిన హామీని ఇప్పటికీ అమలు చేయలేదన్న విషయాన్ని తెలంగాణ ప్రజలు మర్చిపోలేదు. ఈ విషయం రాహుల్‌గాంధీకి తెలియదనుకోవడం అమాయకత్వమే అవుతుంది.

ఎన్నికలు వచ్చిన ప్రతిసారి ఓట్ల కోసం బీసీ జపం చేస్తున్న రాజకీయ పార్టీలు సీట్ల కేటాయింపులో మాత్రం సామాజిక న్యాయం పాటించడం లేదు. ఈ మధ్య ఎక్కువగా బీసీ మంత్రం పఠిస్తున్న కాంగ్రెస్ పార్టీ 2023లో జరిగిన తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో 34 సీట్లు బీసీలకు కేటాయిస్తామని ప్రగల్భాలు పలికింది. చివరికి 23 సీట్లు మాత్రమే కేటాయించింది.

**ప్రస్తుత పార్లమెంట్ ఎన్నికలను చూసుకుంటే.. అన్ని పార్టీల కంటే ఎక్కువగా బీఆర్ఎస్ పార్టీ బీసీలకు 6 స్థానాలను కేటాయించింది. బీజేపీ ఐదు సీట్లను కేటాయించగా, మూడు స్థానాలను మాత్రమే కేటాయించిన కాంగ్రెస్ బీసీలకు తీవ్రంగా అన్యాయం చేసింది. మరోవైపు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నామినేటెడ్ పోస్టుల్లో 90 శాతానికి పైగా తన సామాజికవర్గానికి కేటాయించి బీసీ వ్యతిరేకతను బాహాటంగానే ప్రదర్శించారు.**

ఎన్నో ఏండ్లుగా విద్య, వైద్యం, ఉపాధి, ఉద్యోగం, ఆర్థిక, రాజకీయ, సామాజిక, పారిశ్రామిక రంగాల్లో అవకాశాలు కోల్పోయిన బీసీలు ఇప్పటికైనా ఏకతాటిపైకి రావాలి. రాజకీయంగా చైతన్యవంతం కావాలి. అలా జరిగినప్పుడే రాజ్యాధికారం కైవసం చేసుకుని బీసీలు నిర్ణయాత్మక శక్తిగా ఎదుగుతారు.

**(వ్యాసకర్త: బీసీ సేన రాష్ట్ర అధ్యక్షుడు)**

## మోదీ వేవ్‌పై భ్రమ వద్దు!

*పార్లమెంట్ ఎన్నికలను తేలిగ్గా తీసుకోవద్దు. గ్రామ పంచాయతీ ఎన్నికల్లో పోరాడినట్టే కార్యకర్తలందరూ పోరాడాలి. ప్రతి ఒక్క ఓటర్‌ను పోలింగ్ బూత్‌కు తీసుకువెళ్లాలి. మోదీ వేవ్ ఉందనే భ్రమల్లో ఉండకండి.*

*- నవ్‌నీత్ రాణా,*
*అమరావతి (మహారాష్ట్ర)*
*బీజేపీ ఎంపీ అభ్యర్థి*

